సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 26 । ఆగస్టు । 2025



సిటీకి పండగొచ్చింది

వినాయక చవితి వేడుకలకు విశాఖ నగరం ముస్తాబైంది. వీధులన్నీ పూజా సామగ్రి దుకాణాలతో, గణనాథుడి మండపాలతో కళకళలాడుతున్నాయి. వివిధ రూపాల్లో ఉన్న బొజ్జ గణపయ్య విగ్రహాలు భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. పూజా సామగ్రి అమ్మకాలు ఊపందుకున్నాయి. నగరం అంతటా పండగ వాతావరణం నెలకొంది.



న్యూస్‌రీల్

సెప్టెంబర్ 8 వరకు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు



పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్

మహారాణిపేట: జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా సోమవారం నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు 40వ జాతీయ నేత్ర దాన పక్షోత్సవాలు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతాయని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ మీటింగు హాలులో జేసీ కె.మయూర్ అశోక్, సంబంధిత విభాగాల అధికారులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ వి.మీనాక్షి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ శంకర్ ప్రసాద్, డీఎల్ఓ డాక్టర్ ఆర్ రమేష్, ఎన్టీఆర్ వైద్య సేవ కో–ఆర్డినేటర్ డాక్టర్ అప్పారావు, రీజనల్ ఐ హాస్పిటల్ ఆర్ఎంఓ డాక్టర్ నవీన్ కుమార్, ఆప్తాల్మిక్ ఆఫీసర్లు ఉమా శ్రీనివాస్, ఆర్.సురేష్ పాల్గొన్నారు.

పర్యావరణహితంగా చవితి జరుపుకుందాం



మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: పర్యావరణానికి హాని చేయని విధంగా వినాయక చవితి వేడుకలు నిర్వహించుకోవాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ పిలుపునిచ్చారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సౌజన్యంతో కలెక్టరేట్ ఉద్యోగులకు మట్టి వినాయక ప్రతిమలను ఆయన సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పీవోపీ విగ్రహాలను నివారించాలని సూచించారు. చెరువులు, కాలువలు కలుషితం కాకుండా నిమజ్జనం విగ్రహం పెట్టిన చోటే నిర్వహించాలని కోరారు. పీసీబీ సభ్యుడు పంచకర్ల సందీప్, జేసీ కె. మయూర్ అశోక్‌తో కలిసి కలెక్టర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

'స్ప్రీ' కాలన్ని సద్వినియోగం చేసుకోండి



స్ప్రీ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఈఎస్ఐ అసిస్టెంట్ డైరెక్టర్ శ్యామ్‌ప్రసాద్

సీతంపేట: ఈఎస్ఐ సబ్–రీజినల్ కార్యాలయం ఆధ్వర్యంలో సోమవారం విశాఖ పోర్టు ట్రస్టులో ఇటీవల ప్రారంభించిన 'ఎస్‌పీఆర్ఈఈ (స్ప్రీ) 2025' స్కీమ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఎస్ఐ అసిస్టెంట్ డైరెక్టర్ వి.శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ, పది..అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఉండి ఈఎస్ఐలో ఇంకా నమోదు కాని సంస్థలు డిసెంబర్ 31లోగా రిజిస్టర్ చేసుకోవచ్చని తెలిపారు. దీని కోసం ఎంసీఏ లేదా ఈఎస్ఐసీ పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవచ్చని చెప్పారు. ఈ కాలంలో నమోదు చేసుకున్న సంస్థలకు, యజమాని ప్రకటించిన తేదీని తుది తేదీగా పరిగణిస్తారని, ఆ తేదీకి ముందు ఎటువంటి తనిఖీలు లేదా ఉద్యోగులపై చర్యలు ఉండవని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే ఈఎస్ఐలో నమోదైన యూనిట్లలోని ఉద్యోగులు ఎవరైనా మిగిలిపోయి ఉంటే 'స్ప్రీ' వ్యవధిలో వారిని నమోదు చేసుకుంటే, యజమాని ప్రకటించిన తేదీని తుది తేదీగా పరిగణిస్తారన్నారు. అనంతరం 'స్ప్రీ' కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సోషల్ సెక్యూరిటీ ఆఫీసర్ పి. శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు 'జన్ సున్ వాయి'

మహారాణిపేట: జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చనా మజుందార్ మంగళవారం జెడ్పీ మీటింగ్ హాల్‌లో జరగనున్న 'జన్ సున్ వాయి' కార్యక్రమంలో మహిళల సమస్యలపై వినతులు స్వీకరిస్తారు. బుధవారం పలు కార్యక్రమాలలో పాల్గొంటారు. 28న ఢిల్లీకి బయలుదేరుతారు.

మహారాణిపేట సీఐ బదిలీ

అల్లిపురం: మహారాణిపేట శాంతిభద్రతల సీఐ బాసిన భాస్కరరావును సిటీ వీఆర్–1కు బదిలీ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అడ్మినిస్ట్రేటివ్ కారణాల వల్ల తక్షణమే రిలీవ్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆ స్థానంలో పోర్టు కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ వింగ్ నుంచి జి.దివాకర్ వాయినందన యాదవ్‌ను నియమించారు.

మా పింఛన్ మాకివ్వండి..

కలెక్టరేట్ వద్ద దివ్యాంగుల ఆందోళన

వీల్‌చైర్‌లో ఉన్న కుమార్తె పింఛన్ తొలగించారు..

నా కుమార్తె రెడ్డి శ్రావణ సంధ్య ఎదుగుబొదుగు లేదు. 30 సంవత్సరాలు వచ్చినా వీల్‌చైర్‌లోగాని ఎత్తుకొని గాని తీసుకొని రావాలి. పెడితేనే తిండి తింటుంది. 120 గజాల స్థలం ఉందని చెప్పి నా కుమార్తె పింఛన్ తొలగించారు. కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. తాతల కాలం నాటి ఇల్లు ఉందని చెప్పి దివ్యాంగుల పింఛన్ రద్దు చేయడం అన్యాయం. నా కుమార్తె పింఛన్ పునరుద్ధరించాలి.

– రెడ్డి లక్ష్మిరాజ్యం (తల్లి), శ్రావణి, లక్ష్మినగర్, గోపాలపట్నం



ఇలాంటి వ్యక్తి పింఛనా రద్దు చేసేది

నా భర్త పిన్నింటి ఈశ్వరరావుకు నాలుగు సార్లు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. నడవలేరు.. మాట్లాడలేరు.. ఎక్కడికైనా ఎత్తుకొని తీసుకొని వెళ్లాలి. తిండి కూడా తినిపించాలి. ఇలాంటి వ్యక్తికి పింఛన్ రద్దు చేయడం అన్యాయం. తిరిగి పింఛన్ పునరుద్ధరించండి. నా కుటుంబాన్ని కాపాడండి.

– భార్య పిన్నింటి ఆదిలక్ష్మి, పిన్నింటి ఈశ్వరరావు, రేవిడి, పద్మనాభం మండలం





కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దివ్యాంగులు

మహారాణిపేట: దివ్యాంగులు **కదం తొక్కారు.** సదరం సర్టిఫికేట్ల రీ వెరిఫికేషన్ పేరుతో ఎప్పటి నుంచో వస్తున్న పింఛన్‌ను అర్ధాంతరంగా తొలగించి పొట్ట కొట్టొద్దంటూ ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట వికలాంగుల హక్కుల పోరాట సమితి, ఇతర జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో దివ్యాంగులు నిరసన చేపట్టారు. లక్షల పింఛన్లు ఇస్తున్నామని గొప్పలకు పోతున్న కూటమి సర్కార్ అర్హులైన దివ్యాంగుల పింఛన్లు రద్దు చేస్తోందని మండిపడ్డారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పార్టీలు, కులాలు, మతాలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా.. పారదర్శకంగా పింఛన్లు అందజేసిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నో ఏళ్ల నుంచి వస్తున్న పింఛన్లను ఒక్క సారిగా తొలగించడం అన్యాయమన్నారు. ఆందోళనలో దివ్యాంగుల ఆందోళనకు వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ నాయకుడు తొత్తరమూడి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు ఆక్కిరెడ్డి అప్పారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎత్తుల డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సంఘీభావం

కలెక్టరేట్ ఎదుట దివ్యాంగుల ఆందోళనకు వైఎస్సార్ సీపీ మద్దతు ప్రకటించింది. శాశ్వత ధృవీకరణ పత్రాలు ఉన్నా కూటమి ప్రభుత్వం రీ వెరిఫికేషన్ పేరుతో దివ్యాంగుల పింఛన్లు తొలగించడం దారుణమని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు వాసుపల్లి ఎల్లాజీ అన్నారు. కూటమి ప్రభుత్వం దివ్యాంగుల మీద కక్షతో పెన్షన్లు తీసివేయడం అన్యాయమన్నారు. పింఛన్ తొలగిస్తే ఆ కుటుంబ పరిస్థితి ఏమిటి అని ప్రశ్నించారు. తొలగించిన దివ్యాంగుల పింఛన్లు వెంటనే పునరుద్ధరించాలని, దివ్యాంగుల నుంచి వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించడానికి ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు 12 డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల నియోజకవర్గ అధ్యక్షులు చిప్పుళ్ల వెంకట అప్పారావు, నీలిపు ఈశ్వరరావు, గరికిన చంద్ర శేఖర్, ఉద్యోగులు, పెన్షనర్స్ జిల్లా అధ్యక్షుడు డి.మార్కెండేయులు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న దివ్యాంగుల జేఏసి నాయకులు, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు వాసుపల్లి ఎల్లాజీ

అర్ధాంతరంగా తీసేశారు?



2014 నుంచి నాకు దివ్యాంగ పింఛన్ వస్తోంది. కుటుంబ పోషణతోపాటు ఇద్దరు పిల్లల స్కూలు ఫీజు చెల్లించేదాన్ని. రీ వెరిఫికేషన్ పేరిట ఇప్పుడు పింఛన్ తొలగించడం అన్యాయం. ఇక నుంచి మా పరిస్థితి ఎలా అనేది భయం వేస్తోంది. అర్హత గల నాకు పింఛన్ పునరుద్ధరించాలి.

– పి.నాగమణి, మధురవాడ

మేము ఎలా బతకాలి ?



పోలియో వల్ల నా శరీరంలో ఒక వైపు భాగం పనిచేయడంలేదు. 69 శాతం సదరం సర్టిఫికెట్‌తో నాకు పింఛన్ ఇస్తున్నారు. ఇప్పుడు పింఛన్ రద్దు చేస్తూ నోటీసు ఇచ్చారు. నేను, నా భార్య, ఇద్దరు పిల్లలు ఎలా బతకాలి. నా పరిస్థితి చూసి కేంద్ర ప్రభుత్వం కూడా యూనిక్ ఐడీ ఇచ్చింది. కాని కూటమి సర్కార్ పింఛన్ రద్దు చేయడం వల్ల నా కుటుంబం రోడ్డునపడుతుంది.

–నక్కా వెంకటేశ్వరరావు, గుడివాడ అప్పన్న కాలనీ, 68వ వార్డు

ఎన్టీఆర్ హయాం నాటి పింఛన్ ఆపేశారు..



ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పటి నుంచి నాకు పింఛన్ వస్తోంది. ఇప్పుడు పింఛన్ రద్దు చేస్తూ నోటీసులు ఇచ్చారు. నా ఆరోగ్యం కూడా బాగుండడం లేదు. నాకు ఇంకా వివాహం కాలేదు. పింఛన్ రాకపోతే ఇంట్లో వాళ్లు కూడా చూసే పరిస్థితి లేదు. పింఛన్‌ను పునరుద్ధరించాలి.

–వై.అప్పలకొండ, ఎల్.వి.పాలెం, ఆనందపురం మండలం

కాలు పనిచేయదు..



నాకు ఒక కాలు పూర్తిగా పనిచేయదు. చేయి అంతంత మాత్రం పనిచేస్తుంది. దీనికి తోడు ఫిట్స్, ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నాయి. ఏ పని చేయలేను. సహాయం లేకుండా లేవలేను కూడా. 68 శాతంతో సదరం సర్టిఫికెట్ ఉంది. ఇప్పుడు పింఛన్ తొలగించడం అన్యాయం. పింఛన్ పునరుద్ధరించి నా కుటుంబాన్ని ఆదుకోవాలి.

– కె.రాము, మారికవలస

ప్రవర్తన బాగోలేకపోతే ఆ సౌకర్యాలు కట్

ఖైదీలకు ములాఖత్, క్యాంటీన్ సేవలు ఉండవు

ఆరిలోవ: జైలులో ఖైదీలు అన్నీ కోల్పోతారనేది ఒక అపోహ. వాస్తవానికి వారు నాలుగు గోడల మధ్య కొన్ని సౌకర్యాలను అనుభవిస్తారు. అయితే ఈ సౌకర్యాలు ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉన్నంత వరకే వర్తిస్తాయి. లేకపోతే వారికి కల్పించే ముఖ్యమైన రెండు అవకాశాలను కోల్పోవాల్సి వస్తుంది. సాధారణంగా ఖైదీలకు మూడు పూటలా ఆహారంతో పాటు జైలు లోపల క్యాంటీన్ ఉంటుంది. ఈ క్యాంటీన్‌లో బేకరీ ఉత్పత్తులు, సబ్బులు వంటి నిత్యావసర వస్తువులను కొనుగోలు చేసుకోవచ్చు. శిక్ష పడిన ఖైదీలు నెలకు రూ. 1,500 వరకు, రిమాండ్‌లో ఉన్న ఖైదీలు నెలకు రూ. 3,000 వరకు ఖర్చు చేయవచ్చు.

ఇవే కాకుండా ఖైదీలకు ములాఖత్ (కుటుంబ సభ్యులను కలవడం) సదుపాయం ఉంటుంది. రిమాండ్ ఖైదీలకు వారానికి రెండు ములాఖత్‌లు ఉంటాయి. ఒక్కో ములాఖత్‌లో ముగ్గురు పెద్దలు, పదేళ్ల లోపు పిల్లలు ఉండవచ్చు. శిక్ష పడిన ఖైదీలకు మాత్రం రెండు వారాలకు రెండు ములాఖత్‌లు ఉంటాయి. ఖైదీల ప్రవర్తన సరిగా లేకపోతే, వారికి కల్పిస్తున్న ఈ ముఖ్యమైన సౌకర్యాలను రద్దు చేస్తామని జైలు అధికారులు హెచ్చరిస్తున్నారు. ఖైదీ ప్రవర్తనలోని తీవ్రతను బట్టి ఈ రెండింటిలో ఒకటి లేదా రెండూ కోల్పోవచ్చని చెబుతున్నారు. మూడు రోజుల క్రితం నెల్లూరు నుంచి విశాఖకు తరలించిన శ్రీకాంత్‌కు ఇదే పరిస్థితి ఎదురైంది. నెల్లూరు జైలులో అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉన్నప్పుడు అతను తన ప్రియురాలితో అనుచితంగా ప్రవర్తించాడని, దీనికి శిక్షగా అతని ములాఖత్, క్యాంటీన్ సౌకర్యాలను రద్దు చేయాలని నెల్లూరు జైలు అధికారులు ఆలోచనలో ఉన్నట్టు విశాఖ జైలు అధికారులు భావిస్తున్నారు. అదే జరిగితే శ్రీకాంత్‌ను ఎవరూ కలవడానికి వీలుండదు.



విశాఖ కేంద్ర కారాగారం..

ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులపై విచారణ

సాక్షి, విశాఖపట్నం: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులపై కొత్త విచారణ అధికారిని నియమిస్తూ ప్రభుత్వం ఆదేశిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. లేబర్, ఫ్యాక్టరీస్, బోట్ అండ్ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ విభాగంలో ఏసీబీ ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో భాగంగా ప్రస్తుతం విశాఖపట్నంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జాయింట్ చీఫ్‌గా విధులు నిర్వర్తిస్తున్న జె.శివశంకర్‌రెడ్డి, విశాఖపట్నం సర్కిల్–1 ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.సుధాకర్‌పై ఏసీబీ అభియోగాలు మోపింది. పలు అక్రమాలు, అవినీతి కార్యకలాపాలు గుర్తించినట్లు తమ నివేదికలో పేర్కొంది. దీనిపై మరింత విచారణ చేపట్టేందుకు ప్రభుత్వం ఏసీబీ సీఐ బి.విజయ్‌కుమార్‌ని విచారణాధికారిగా నియమించింది. ఇప్పుడు ఆయన స్థానంలో విశాఖపట్నం రేంజ్ సీఐ సీహెచ్.లక్ష్మణరావుని నియమిస్తూ విజిలెన్స్ విభాగం ప్రభుత్వ కార్యదర్శి శేషగిరిబాబు ఉత్తర్వులు జారీ చేశారు. సమగ్ర విచారణ నిర్వహించి నివేదిక త్వరితగతిన అందజేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

ఏయూ రిజిస్ట్రార్ అనూహ్య నిర్ణయం

- తనను రిలీవ్ చేయాలని వీసీకి లేఖ రాసిన ధనుంజయరావు
- సరిగ్గా ఏడాది పాటు విధులు
- తప్పుకోవాలనే నిర్ణయం వెనుక భిన్నవాదనలు



విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఇ.ఎన్.ధనుంజయరావు ఆ బాధ్యతల నుంచి తప్పుకోవాలని నిర్ణయించారు. రిజిస్ట్రార్ పదవి నుంచి రిలీవ్ చేయాలని ఆయన ఏయూ వీసీ ప్రొఫెసర్ జి.పి.రాజశేఖర్‌కు లేఖ రాశారు. రిజిస్ట్రార్‌గా ధనుంజయరావు సరిగ్గా ఏడాది క్రితం బాధ్యతలు చేపట్టారు. సోమవారంతో ఏడాది పూర్తయిన తరుణంలో ఆయన రిజిస్ట్రార్ బాధ్యతలను తప్పించాలని కోరడం ఏయూలో చర్చనీయాంశమవుతోంది. వాస్తవానికి తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు ఆయన రిజిస్ట్రార్‌గా కొనసాగే అవకాశముంది. కానీ ఏడాదికే తప్పుకోవాలని నిర్ణయించడం వెనుక భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఏయూ వీసీ, రిజిస్ట్రార్‌ల మధ్య ఏవైనా మనస్పర్థలు కారణంగా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారని ఒక వాదన కాగా.. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా తప్పుకోవాలని నిర్ణయించారనే మరో వాదన వినిపిస్తోంది. అయితే రిజిస్ట్రార్ ధనుంజయరావు ఏడాది కాలంలో ఏయూలో మంచి పేరు సంపాదించుకున్నారు. సమస్యలను సామరస్యంగా పరిష్కరించగల సామర్థ్యం ఉన్న అధికారిగా గుర్తింపు పొందారు. టీచింగ్, నాన్‌టీచింగ్.. ఇలా అందరినీ సమన్వయం చేసుకుంటూ పాలన సాగిస్తున్నారు. అటువంటి రిజిస్ట్రార్ ఆకస్మికంగా తనను రిలీవ్ చేయాలని కోరడం వెనక బలమైన కారణం ఉందన్న ఊహాగానాలు చెలరేగుతున్నాయి.

పరిష్కారం అ'భూ'త కల్పనే..

కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మళ్లీ అదే కథ. వివిధ శాఖలకు సంబంధించి 329 ఫిర్యాదులు రాగా, వాటిలో సగం కంటే (141)ఎక్కువ ఫిర్యాదులు రెవెన్యూ శాఖకు చెందినవే. భూమికి సంబంధించిన వివాదాలు, రికార్డుల తారుమారు, పట్టాల మంజూరులో జాప్యం, సర్వేలో తలెత్తే లోపాలపై ప్రజలు పదే పదే ఫిర్యాదు చేస్తున్నా, వాటికి సరైన పరిష్కారం లభించడం లేదు. అధికారుల నిర్లక్ష్యం, జవాబుదారీతనం లేకపోవడం వల్ల ఈ సమస్యలు నిత్యకృత్యంగా మారింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే, భూ సమస్యల పరిష్కారం ఇక కలగానే మిగిలిపోతుందా అనే ప్రశ్న తలెత్తుతోంది.

- అర్జీదారులకు అగచాట్లు
- పరిష్కారం కాని రెవెన్యూ సమస్యలు



కలెక్టర్‌కు వినతి పత్రాలను సమర్పిస్తున్న అర్జీదారులు

మహారాణిపేట: ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులు, వాటి పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యంపై కలెక్టర్ హరేందిర ప్రసాద్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫిర్యాదులను సరిగ్గా పరిష్కరించకపోతే కఠిన చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. గతంలో వచ్చిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను సమీక్షించి, అధికారుల తీరు మెరుగుపడాలని సూచించారు. ఫిర్యాదుదారుతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి సమస్యను సంతృప్తికరంగా పరిష్కరించాలని, తీసుకున్న చర్యలను వివరిస్తూ సరైన ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని స్పష్టం చేశారు. 'తన సహనాన్ని పరీక్షించవద్దని, సమస్యల పరిష్కార విధానంలో మార్పు రావాలని' కలెక్టర్ తీవ్రంగా హెచ్చరించారు. కార్యక్రమంలో జేసీ కె.మయూర్ అశోక్, ఇన్‌చార్జి డీఆర్వో సత్తిబాబు ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు.

సమస్యలు పరిష్కారం కానిది ఎందుకు?

అధికారులు పట్టించుకోకపోవడం, నిబంధనలను పాటించకపోవడం, లంచం ఆశించడం వంటి కారణాల వల్ల ప్రజల సమస్యలు పరిష్కారం కావడం లేదని తెలుస్తోంది. ముఖ్యంగా భూములకు సంబంధించిన రికార్డులు సరిచేయడం, సర్వేలు నిర్వహించడం, పట్టాలు మంజూరు చేయడంలో జాప్యం జరుగుతోందని ప్రజలు వాపోతున్నారు. కొన్ని సందర్భాల్లో అధికారులు తప్పుల మీద తప్పులు చేసి ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. దీని వల్ల ప్రజలు తమ సమస్యల పరిష్కారం కేవలం అ'భూ'త కల్పనగా భావిస్తున్నారని చెప్పాలి. దీనిపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించి ప్రజల సమస్యలకు సత్వరం పరిష్కారం చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తప్పుడు పత్రాలతో భూ కబ్జా



తప్పుడు పత్రాలతో తన ఆస్తిని కబ్జా చేశారు. తగరపువలసలోని మెయిన్ రోడ్డులో ఉన్న తమ థియేటర్ స్థలాన్ని తనకు తెలియకుండా ఇతరులకు అప్పగించారు, సర్వే నంబర్ 47,1డి5లో ఉన్న 71 సెంట్ల స్థలం తన భర్త ద్వారా 1976లో అన్నదమ్ములకు దఖలు పడింది..దాన్ని ఉపయోగించి తాతా ఫిక్చర్ ప్యాలెస్ నిర్మించారు. తన భర్త, ఇతర భాగస్వాములు కలిసి నకిలీ పత్రాలు సృష్టించి, తనకు ఎలాంటి సెటిల్‌మెంట్ ఇవ్వకుండా పార్టనర్‌షిప్ నుంచి తొలగించారు. తనకు అన్యాయం చేసిన రెవెన్యూ అధికారులు, జీవీఎంసీ డీసీఆర్, భీమిలి జోనల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి. గతంలో ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు.

– పరిమి లక్ష్మి, భీమిలి, తాతా థియేటర్ పార్టనర్

పింఛన్ ఇవ్వడం లేదు



నాకు 66 శాతంతో సదరం సర్టిఫికెట్ ఉంది. పింఛన్ కోసం చాలాసార్లు దరఖాస్తు చేశా. కాళ్లు,చేతులు సక్రమంగా పని చేయవు. నాకు భర్త, ఇద్దరు పిల్లలున్నారు. పింఛన్ కోసం దరఖాస్తు చేసినా ఎవరు పట్టించుకోవడం లేదు. కుటుంబ పోషణ చాలా భారంగా ఉంది. – బత్తి హేమ, అశోక్‌నగర్, గాజువాక

రాళ్ల చెరువును కాపాడండి

మధురవాడలోని సర్వే నంబర్ 65/10లో 2.90 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న రాళ్ల చెరువును కొందరు అక్రమార్కులు ఆక్రమించుకున్నారు. ప్రభుత్వ రికార్డుల్లో ఇది 'ట్యాంక్ పోరంబోకు'గా నమోదైంది.గతంలో అనేకసార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేదు. సోమవారం పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయగా.. కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.



ఆర్టీఏ యాక్టివిస్ట్ సంతోష్ కుమార్

దుర్గామాతగా..





ఫుట్‌బాల్ కప్‌తో..



గోమాతతో..



విద్యార్థి గణపతిగా..



ఆంజనేయుడిగా..



బాల గణపతి



ఫిట్‌నెస్ గణపతి



ఊయల ఊగుతూ..

గరుడ వాహనంపై..



అపు'రూపాలు'

డాబాగార్డెన్స్: వినాయక చవితి వేళ గణపతి విగ్రహాలు వివిధ రూపాల్లో దర్శనమిస్తున్నాయి. సంప్రదాయ రూపాలతో పాటు, సామాజిక అంశాలు, సినిమా పాత్ర లు, ప్రస్తుత ట్రెండింగ్ కాన్సెప్ట్‌ల ఆధారంగా రూపొందించిన విగ్రహాలు భక్తులను ఆకర్షిస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ మట్టితో చేసిన పర్యావరణ హిత గణపతులు ఈ ఏడాది కూడా ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రతి సంవత్సరంలాగే పల్లెటూరి వాతావరణాన్ని, రైతుల కష్టాలను తెలిపే విగ్రహాలు కూడా పూజలకు సిద్ధమయ్యాయి. ఈ సారి గణేష్ మండపాల్లో భిన్నమైన రూపాల్లో ఉన్న గణపతి విగ్రహాలు పండుగకు కొత్త శోభను తీసుకొచ్చాయి.

కార్తీక్ బొమ్మలకు భలే గిరాకీ..

ఒడిశాకు చెందిన ప్రముఖ కళాకారుడు కార్తీక్ తయారుచేసే గణపతి విగ్రహాలకు విశాఖ నగరంలో మంచి గిరాకీ ఉంది. నాలుగు దశాబ్దాలుగా నగర ప్రజలకు సుపరిచితుడైన కార్తీక్, ఆర్డర్ల ఆధారంగా మూడు అడుగుల నుంచి 40–50 అడుగుల ఎత్తు వరకు వివిధ రూపాల్లో విగ్రహాలను రూపొందిస్తుంటారు. ఈయన గణపతిని విశ్వేశ్వరుడు, పరమ శివుడు, పార్వతీ పరమేశ్వరుల తనయుడు, అయ్యప్ప స్వామి వంటి వివిధ దైవ రూపాల్లో తీర్చిదిద్దడంలో దిట్ట. అందుకే కార్తీక్ విగ్రహాలంటే నగర ప్రజలు ఎంతగానో ఇష్టపడతారు.

-ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం




జారుడుబల్లాడుతూ..



రయ్‌మంటూ..



చవితి చంద్రుడిగా..



పరమశివుడిగా..



వరసిద్ధి వినాయకుడిగా..



మిసైల్‌పై..

ఆ కన్నీళ్లకు అంతుందా?

- అనారోగ్యంతో చిన్న కుమార్తె మృతి
- ఆరు నెలల క్రితం పెద్ద కుమార్తె కూడా..
- శోకసంద్రంలో తల్లిదండ్రులు



మాధురి (ఫైల్)

మల్కాపురం: నగరాలవీధిలో నివసించే సత్యనాల శేఖర్, నారాయణమ్మ దంపతుల జీవితం ఎప్పుడూ నవ్వులు, సంతోషాలతో నిండి ఉండేది. వారికి ఇద్దరు ఆడపిల్లలు. సమాజం ఆడపిల్లలను చూసే కోణాన్ని పక్కన పెట్టి, వారిని కుమారుల్లా పెంచి పెద్ద చేశారు. ఉన్నత చదువులు చదివించారు. వారి ఆశలన్నీ ఆ ఇద్దరు కుమార్తెల మీదే. పెద్ద కుమార్తె భాగ్యశ్రీ , సీఏ ఫైనల్ ఇయర్. చిన్న కుమార్తె గాయిత్రీ మాధురి మెడిసిన్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. ఇదిలావుండగా ఆరు నెలల క్రితం ఆ కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. పెద్ద కుమార్తె భాగ్యశ్రీ స్నేహితులతో కలిసి యారాడ సముద్ర తీరానికి వెళ్లింది. సముద్రంలో గల్లంతై మృత్యువు ఒడిలోకి చేరుకుంది. కళ్ల ముందే మెరుస్తున్న దీపం ఆరిపోవడంతో ఆ తల్లిదండ్రులు కుప్పకూలిపోయారు. ఆ బాధను ఎలాగో దిగమింగుకుని.. చిన్న కుమార్తె గాయత్రి మాధురిని కంటికి రెప్పలా చూసుకుంటూ జీవిస్తున్నారు. తమ ఆశలన్నీ ఆమె మీదే పెట్టుకున్నారు. కానీ విధి వారిని మళ్లీ క్రూరంగా చూసింది. మాధురికి పచ్చకామెర్లు వచ్చాయి. ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. తమ కళ్లెదుటే మెరుస్తున్న వెలుగు మళ్లీ ఆరిపోకూడదని ఆ భగవంతుడిని వేడుకున్నారు. ఆదివారం రాత్రి ఆ దేవుడు వారికి కడుపుకోత మిగిల్చాడు. మాధురి ప్రాణాలు కోల్పోయింది. కన్నవారి కన్నీళ్లకు అంతు లేకుండా పోయింది. కంటికి రెప్పలా చూసుకున్న ఇద్దరు కూతుళ్లు ఇప్పుడు లేరు. దీంతో ఆ తల్లిదండ్రులు గుండెలు పగిలేలా రోదిస్తున్నారు. వారిని ఓదార్చడం ఎవరితరం కాలేదు. ఈ విషాదకర సంఘటనతో మల్కాపురం ప్రాంతం శోకసంద్రంలో మునిగిపోయింది. ఆ తల్లిదండ్రుల కన్నీటి గాథ వింటున్న ప్రతి ఒక్కరి హృదయం ద్రవించింది.

12న రెడ్ క్రాస్ సొసైటీ సర్వసభ్య సమావేశం

మహారాణిపేట: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సర్వసభ్య సమావేశం సెప్టెంబర్ 12న కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించనున్నారు. సభ్యులంతా సభ్యత్వ కార్డులతో రామా టాకీసు వద్ద గల అంబేడ్కర్ భవన్‌లో జరిగే సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలని రెడ్ క్రాస్ సొసైటీ ఒక ప్రకటనలో తెలిపింది. సమావేశంలో 10 మంది సభ్యులతో కూడిన జిల్లా బ్రాంచి కమిటీని ఎన్నుకోనున్నారు.

విశాఖ-బనారస్ రైలు రద్దు

తాటిచెట్లపాలెం: సౌత్ ఈస్ట్రన్ రైల్వే పరిధిలో జరుగుతున్న నాన్ ఇంటర్ లాకింగ్ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే విశాఖపట్నం–బనారస్–విశాఖపట్నం వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఈ నెల 27, 31న, సెప్టెంబరు 10వ తేదీల్లో విశాఖపట్నం–బనారస్ (18523) బై వీక్లీ ఎక్స్‌ప్రెస్, తిరుగు ప్రయాణంలో ఈ నెల 28, సెప్టెంబరు 1, 11వ తేదీల్లో బనారస్–విశాఖపట్నం (18524) బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారన్నారు.

సమస్యల సాధన కోసం పోరుబాట

కలెక్టరేట్ వద్ద పెన్షనర్లు, నాయి బ్రాహ్మణుల నిరసన



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆల్ పెన్షనర్లు, రిటైర్డు పర్సన్స్



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న నాయీ బ్రాహ్మణులు

మహారాణిపేట: వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు పెద్ద సంఖ్యలో సోమవారం కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకున్నారు. వివిధ సంఘాల నేతలు కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. తమ పెన్షన్లు తొలగించడంతో దివ్యాంగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వీరికి మద్దతుగా వైఎస్సార్‌సీపీ నాయకులు, ఇతర దివ్యాంగుల సంఘాల నేతలు కూడా వచ్చారు. దివ్యాంగులు వీల్ చైర్లు, ద్విచక్ర వాహనాలపై వచ్చి నిరసనలో పాల్గొన్నారు.

పెన్షనర్ల డిమాండ్లు

పెన్షనర్లకు చెల్లించాల్సిన రూ. 20,000 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు కె. ధీనబంధు మాట్లాడుతూ, నాలుగు పెండింగ్ డీఏలను కూడా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ కమిషనర్‌ను నియమించి, మధ్యంతర భృతిని ప్రకటించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి ఎస్.కె. హుస్సేన్ మాట్లాడుతూ, ఎంప్లాయీస్ హెల్త్ స్కీం కింద అన్ని కార్పొరేట్ ఆసుపత్రులలో ఉచిత వైద్యం అందించాలని, పెండింగ్‌లో ఉన్న హెల్త్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు.

నాయీ బ్రాహ్మణుల నిరసన

సెలూన్ షాపులు నడుపుతున్న నాయీ బ్రాహ్మణులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించాలని ప్రభుత్వం జారీ చేసిన జీవోను అమలు చేయాలని నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. వారంతా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. బీజేపీ వైద్య విభాగం కన్వీనర్ కాపవరపు వీర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ఈ జీవోను అమలు చేసి నాయి బ్రాహ్మణులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయి బ్రాహ్మణ నాయకులు పాల్గొన్నారు.

లోకేశ్వరరావుపై విచారణకు ప్రభుత్వం ఆదేశం

తగరపువలస: గతంలో పద్మనాభం తహసీల్దార్‌గా పనిచేసిన ప్రస్తుత అల్లూరి సీతారామరాజు జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎంవీఎస్ లోకేశ్వరరావుపై అవినీతి ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం క్రమశిక్షణా చర్యలు చేపట్టింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.జయలక్ష్మి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పద్మనాభం మండలం రేవిడి పంచాయతీలోని సర్వే నంబర్ 73/2, అలాగే పొట్నూరు పంచాయతీలోని సర్వే నంబర్ 107లో నిబంధనలకు విరుద్ధంగా ఆయన కొందరికి పట్టాలు జారీ చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆరోపణలపై ఉత్తర్వులు అందిన పది రోజుల్లోగా రాతపూర్వక వివరణ ఇవ్వాలని లోకేశ్వరరావును ఆదేశించింది.

నేడు జర్నలిస్టులకు వినాయక ప్రతిమల పంపిణీ

డాబాగార్డెన్స్: జర్నలిస్టులకు మంగళవారం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయనున్నట్టు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపీ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్, ఏపీ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్‌లు తెలిపాయి. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఫెడరేషన్ విశాఖ అధ్యక్షుడు పి.నారాయణ్ మాట్లాడుతూ మంగళవారం ఉదయం 10 గంటలకు వేమన మందిరంలో ఈ కార్యక్రమం జరగనుందన్నారు. వినాయక వ్రత కల్పం, పూలు, పండ్ల మొక్కలు కూడా పంపిణీ చేయనున్నామని చెప్పారు.

మట్టి విగ్రహాల పంపిణీ : ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆధ్వర్యంలో పలువురు జర్నలిస్టులకు సోమవారం జీవీఎంసీ సమీపాన మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ కాంట్రాక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే నగర అధ్యక్షుడు కె.రాము, ప్రధాన కార్యదర్శి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

యంత్రం ఖరీదు వాపస్ చేయాలి

విశాఖ లీగల్: బీమా కలిగి ఉన్న సమయంలో యంత్రానికి ప్రమాద జరిగితే ఆ నష్టాన్ని బీమా కంపెనీ భర్తీ చేయాలని నగరంలోని వినియోగదారుల సమస్యల పరిష్కార కమిషన్-2 అధ్యక్షురాలు గేదెల వెంకటేశ్వరి, సభ్యులు పి విజయ దుర్గ, కె.రమణబాబులు తీర్పునిచ్చారు. యంత్రం ఖరీదు రూ. 7 లక్షలు..ఆరు శాతం వడ్డీతో ఇవ్వాలని, సేవా లోపం కలిగించినందుకు రూ. 20 వేలు చెల్లించాలని, ఖర్చులకు మరో రూ. 10 వేలు అదనంగా చెల్లించాలని తీర్పులో స్పష్టం చేసింది. అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం రామన్నపాలెం చెందిన వినియోగదారుడు పి.శంకరరావు 2020లో హిటాచి కంపెనీకి చెందిన జేసీబీని కొనుగోలు చేశారు. ఆ యంత్రానికి 2023 జనవరి 20 తేదీన నర్సీపట్నంలోని యునైటెడ్ ఇన్సూరెన్స్ కంపెనీలో ఏడాది కాలానికి బీమా చేయించారు. కంపెనీ ప్రధాన కార్యాలయం విశాఖలో ఉంది. బీమా 2024 జనవరి 19వ తేదీ వరకు అమలులో ఉంది. 2023 మార్చి 21 తేదీ రాత్రి జేసీబీ అగ్ని ప్రమాదానికి గురైంది. ప్రమాదవశాత్తు కాలిపోయింది. వెంటనే వినియోగదారుడు శంకరరావు బీమా కంపెనీకి ఫిర్యాదు చేశారు. కంపెనీ యాజమాన్యం పట్టించుకోలేదు. వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపిన కమిషన్ పై విధంగా తీర్పునిచ్చారు.

'కూటమికి ఓటేసినందుకు ప్రజలు పశ్చాత్తాపం'



మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

సీతంపేట: కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్ వెస్లీ తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికలకు ముందు కూటమి నాయకుల మాటలు నమ్మి ఓట్లు వేసినందుకు ప్రజలు ఇప్పుడు పశ్చాత్తాపపడుతున్నారని ఆయన అన్నారు. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను ఆయన వివరించారు. యూరియా కోసం రైతులు కిలోమీటర్ల మేర క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నానో యూరియాను వాడాలని రైతులపై ఒత్తిడి తీసుకురావడం బాధాకరమన్నారు. నానో యూరియా వల్ల పంట దిగుబడిలో ప్రోటీన్స్, నత్రజని శాతం తగ్గి ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని ఆయన హెచ్చరించారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది యూరియా సరఫరా తగ్గిందని, ప్రైవేటు డీలర్లు యూరియాను బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని జాన్‌వెస్లీ మండిపడ్డారు. రైతాంగాన్ని దుర్భర పరిస్థితుల్లోకి నెట్టిన కూటమి ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని ఆయన అన్నారు.

సచివాలయ ఏఎన్‌ఎంల రిలే దీక్షలు



నినాదాలు చేస్తున్న ఏఎన్‌ఎంలు

బీచ్‌రోడ్డు: గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలు..తమ సమస్యల పరిష్కారం కోసం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సామూహిక రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహనరావు మాట్లాడుతూ గ్రేడ్ 3 ఏఎన్‌ఎంలకు పదోన్నతి కల్పించాలని ప్రభుత్వం ఆరు నెలల క్రితమే నిర్ణయించినప్పటికీ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రక్రియ ముందుకు సాగడం లేదని విమర్శించారు. ఇతర శాఖల పనులు అప్పగించి జీతాలు నిలిపివేస్తామని బెదిరింపులకు గురిచేస్తున్నారని, జీవో 124 ప్రకారం ఏఎన్‌ఎంలకు ఆ పనులు అప్పగించకూడదని స్పష్టంగా ఉన్నా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఉమ్మడి జిల్లా విలేజ్ వార్డ్ హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు దేవకి మాట్లాడుతూ పదోన్నతులు వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు.యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుభాషిణి మాట్లాడుతూ సచివాలయంలో పనిచేస్తున్న వైద్య ఆరోగ్య శాఖలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షురాలు మణి మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జూమ్ మీటింగ్లో ఏఎన్‌ఎంలపై తీవ్ర దుర్భాషలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి చుక్కల సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు రాము మాట్లాడారు. అనంతరం యూనియన్ ప్రతినిధి బృందం కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేసింది. వారంలోగా పదోన్నతుల ప్రక్రియ పూర్తిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. తర సమస్యలపై యూనియన్‌తో సమావేశం ఏర్పాటు చేసి పరిష్కరించాలన్నారు.

● దాహం తీరిందా..



దివ్యాంగుల ధర్నాలో ఒక వానరం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ ధర్నాకు వచ్చిన ట్రాన్స్‌జెండర్ ఈ కోతిని తీసుకొచ్చింది. ఆమె ఎలా అలంకరించుకుందో.. అదే తరహాలో కోతిని ముస్తాబు చేసింది. ధర్నాకు వచ్చిన వారితో పాటు అటుగా వెళ్లిన వారు సైతం ఆ చిన్న వానరాన్ని చూడడానికి ఆసక్తి చూపించారు.

క్లాప్ డ్రైవర్‌పై జెడ్సీ దాడి

సస్పెండ్ చేయాలంటూ కార్మికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

భీమునిపట్నం: చెత్త తరలించే క్లాప్ వాహన డ్రైవర్ ఇంటి శ్రీనుపై జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు చేయి చేసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. శ్రీను విధులను సరిగా నిర్వర్తించడం లేదని ఆరోపిస్తూ ఆయనపై చేయి చేసుకున్నారు. ఈ ఘటనతో ఆగ్రహించిన పారిశుధ్య కార్మికులు జోనల్ కార్యాలయం వద్ద సోమవారం నిరసనకు దిగారు. వారికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్. మూర్తి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ ఒక బాధ్యతగల అధికారి ఇలా ప్రవర్తించడం సరికాదన్నారు. డ్రైవర్ దళితుడు కావడం వల్లే ఇలా చేశారని, ఇది దారుణమని ఆయన ఆరోపించారు. సరిగా పని చేయకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలే తప్ప, ఇలా దాడి చేయడమేంటని ప్రశ్నించారు. జోనల్ కమిషనర్‌ను సస్పెండ్ చేసి, కేసు నమోదు చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై జెడ్సీ అయ్యప్పనాయుడు వివరణ కోరగా.. 'కోపంతో అలా చేశాను. దీనికి ఇంత రాద్ధాంతం ఎందుకు?' అని బదులిచ్చారు. అంతేకాకుండా.. ప్రతి ఒక్కరూ తమ విధులను సక్రమంగా నిర్వహిస్తే సమస్యలు ఉండవని అన్నారు.

ఉతికి పిండి ఆరేశారు

- 'ఉతుకు, పిండు, ఆరేయ్' పాటకు విశేష ఆదరణ
- యూట్యూబ్‌ను షేక్ చేస్తున్న సాంగ్
- తెలుగు బుక్‌ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం



తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్



పాట చిత్రీకరణలో దర్శకుడు యాదకుమార్ (ఫైల్)

కొమ్మాది: ఇటీవల విడుదలైన 'ఉతుకు, పిండు, ఆరేయ్' అనే పాట సోషల్ మీడియాలో వైరల్‌గా మారి, విశేష ఆదరణ పొందుతోంది. మాస్ స్టైల్‌లో సందేశాత్మక లిరిక్స్ ఉండటంతో ఈ పాట అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. యువతను లక్ష్యంగా చేసుకుని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఈ పాట సందేశం ఇస్తోంది. నగరానికి చెందిన 300 మంది కళాకారులతో ఈ పాటను విశాఖ పర్యాటక ప్రాంతాల్లో చిత్రీకరించారు. ఒకేసారి ఇంతమంది కళాకారులతో చిత్రీకరణ జరపడం ద్వారా ఈ పాట తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకుంది. పూర్ణామార్కెట్‌కు చెందిన యాదకుమార్ ఈ పాటకు దర్శకత్వం వహించగా, ధనుంజయ్, నిహారిక ఇందులో నటించారు. పల్సర్ బైక్ రమణ ఈ పాటను ఆలపించగా, నిస్సీ జెస్టిన్ సంగీతం, సందీప్ మిరియాల సాహిత్యం అందించారు. పాటకు లభించిన అనూహ్య స్పందన నేపథ్యంలో, వినాయక చవితి సందర్భంగా బుధవారం దీనికి సంబంధించిన డీజే మిక్సింగ్ పాటను విడుదల చేయనున్నట్లు దర్శకుడు యాదకుమార్ తెలిపారు.

జీవీఎంసీ పీజీఆర్‌ఎస్‌కు 114 వినతులు



అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మతో కలిసి ఫిర్యాదులు స్వీకరిస్తున్న సిటీ ప్లానర్ మీనా కుమారి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 114 వినతులు అందాయి. అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, సిటీ ప్లానర్ మీనాకుమారి ఫిర్యాదులు స్వీకరించారు. వీటిలో పట్టణ ప్రణాళికా విభాగానికి అత్యధికంగా 55 ఫిర్యాదులు అందాయి. జీవీఎంసీ అడ్మినిస్ట్రేషన్ అండ్ అకౌంట్స్ విభాగానికి 4, రెవెన్యూ విభాగానికి 19, ప్రజారోగ్య శాఖకు 8, ఇంజినీరింగ్ విభాగానికి 19, హార్టికల్చర్ విభాగానికి 3, యూసీడీకి 6 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, ఫైనాన్సర్ అడ్వైజర్ మల్లికాంబ, డీసీఆర్ ఎస్.శ్రీనివాసరావు, పర్యవేక్షక ఇంజినీర్లు కె.శ్రీనివాసరావు, సంపత్‌కుమార్, కృష్ణారావు పలువురు అధికారులు పాల్గొన్నారు.